


యథేచ్ఛగా చెట్ల నరికివేత

కలప స్మగ్లర్లు మాచారెడ్డి మండలంలోని అటవీ ప్రాంతం నుంచి యథేచ్ఛగా టేకు చెట్లను నరుకుతూ తరలిస్తున్నారు.

- 8లో ▸



కొరవడిన అవగాహన

వానాకాలం సాగు మొదలుకానున్న నేపథ్యంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 44.1 /28.1

ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

మత్తు దందాపై ఉక్కుపాదం!



- ఐదు నెలల్లో 17 మంది అరెస్టు
- ఏడు కిలోల అల్ప్రాజోలం, డైజోఫాం పట్టివేత
- ఐదున్నర కిలోల గంజాయి కూడా..
- కట్టడి చేస్తున్నా ఆగని అక్రమ దందా

సాక్షి, కామారెడ్డి: మత్తు పదార్థాల అక్రమ దందాను అరికట్టేందుకు ఆబ్కారీ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు మత్తు పదార్థాలు సప్లయ్ చేసే వారిపై నిఘా పెట్టి వారిని పట్టుకోవడంలో సక్సెస్ అవుతున్నాయి. జిల్లాలో ఐదు నెలల కాలంలో మత్తు దందాకు సంబంధించి 17 మందిని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతర జిల్లాల్లోనూ జిల్లాకు చెందిన మత్తు పదార్థాల వ్యాపారులు పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో కామారెడ్డికి చెందిన ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ మత్తు దందాలో చిక్కి కటకటాల పాలయ్యాడు. జిల్లాలో ఆరు కిలోల 540 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఆరు మోటారు సైకిళ్లు, ఒక కారు, ఒక సైకిల్, మూడు మొబైల్స్‌ను ఆబ్కారీ అధికారులు సీజ్ చేశారు. అలాగే 460 గ్రాముల డైజోఫాం కూడా పట్టుకుని ఒకరిని అరెస్టు చేశారు. 5.49 కిలోల ఎండు గంజాయిని పట్టుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. అలాగే నాలుగు గంజాయి మొక్కలను ధ్వంసం చేసి ఒక కేసు నమోదు చేశారు. మత్తు దందా చేసేవారిని వదిలిపెట్టేది లేదని.. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి రవిరాజ్ తెలిపారు.



అల్ప్రాజోలం కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమయ్య(ఫైల్)

మూలాలపై దృష్టిపెడితేనే..

కృత్రిమ కల్లు తయారీ కోసం వాడే అల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాల దందాను అరికట్టేందుకు ఆబ్కారీ శాఖ కఠినంగా వ్యవహరిస్తూ, చిక్కిన వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లు నమోదు చేస్తున్నప్పటికీ దందా మాత్రం ఆగడం లేదు. గత ఐదు నెలల్లో జిల్లాలో మత్తు దందాలో 17 మందిని అరెస్టు చేసినప్పటికీ.. ఈ దందాలో రుచిమరిగిన వారు కొందరు ఆబ్కారీ అధికారులకు చిక్కకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టుబడిన ఓ ముఠాలో కామారెడ్డి జిల్లాకు చెందిన వారు ఉన్నారు. వారిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అదే కేసులో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఒకరిని కూడా అరెస్టు చేసి కారాగారానికి పంపారు. డిపార్ట్‌మెంటల్ యాక్షన్‌లో భాగంగా సస్పెండ్ చేశారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేసి జైళ్లకు పంపిస్తున్నప్పటికీ దందా మాత్రం తగ్గడం లేదని తెలుస్తోంది. మూలాలపై దృష్టిపెడితే అసలు సూత్రధారులు చిక్కి దందాకు బ్రేక్ పడుతుందని భావిస్తున్నారు.

గుప్పుమంటున్న గంజాయి

ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున గంజాయి జిల్లాకు తరలివస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా యువతకు పొట్లాల రూపంలో గంజాయిని చేరవేస్తున్నారు. కామారెడ్డి పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని తెలుస్తోంది. మత్తు దందాను అరికట్టేందుకు ఆబ్కారీ శాఖ చర్యలు తీసుకుంటున్నప్పటికీ గంజాయి దందాకు అలవాటుపడిన వారు కొత్తకొత్త మార్గాల్లో తీసుకువచ్చి మత్తుకు అలవాటుపడ్డ వారికి విక్రయిస్తున్నారు. గతి తప్పిన యువకులు విచ్చలవిడిగా గంజాయి పీలుస్తూ మత్తులో మునిగితేలుతున్నారు. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో చాలా మంది యువకులు మత్తు కోసం గంజాయి వైపు మళ్లినట్లు తెలుస్తోంది. పొట్లాల రూపంలో యువతకు గంజాయిని చేరుస్తున్న ముఠాలపై కూడా ఆబ్కారీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



న్యూస్‌రీల్

3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



బీబీపేట: జిల్లాలో ఇప్పటి వరకు 53,790 మంది రైతుల నుంచి 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. బీబీపేట మండలం కోనాపూర్, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం బీబీపేట లోని శ్రీనివాస ఆగ్రో రైస్‌మిల్లును జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం సందర్శించారు. ఏడు లారీలు మిల్లు పాయింట్ వద్ద నిలిచి ఉన్నందున ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ. 683 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి.. రైతుల ఖాతాల్లో రూ. 632 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 327 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. 23 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

ఆలయాల భూములను కాపాడాలి



మద్నూర్(జుక్కల్): ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని దేవాదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ సూచించారు. మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గురువారం బాన్సువాడ డివిజన్‌లోని దూపదీప నైవేద్యం అర్చకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆలయాలకు సంబంధించిన ఆస్తులను అర్చకులు రక్షించాలన్నారు. అనంతరం అర్చకులకు ఐడెంటీ కార్డులను అందజేశారు.

ఆలయ హుండీ లెక్కింపు

సలాబత్‌పూర్ ఆలయంలోని హుండీ లెక్కింపును అధికారులు గురువారం చేపట్టారు. హుండీ ఆదాయం రూ. 3,74,137 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వేణు, కల్పన, అర్చకులు విజయ్, అరవింద్ పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లు వాడితే క్రిమినల్ చర్యలు



ఖలీల్‌వాడి: బైక్‌లకు మోడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. ఇటీవల కాలంలో స్వాధీనం చేసుకున్న 122 సైలెన్సర్లను సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు గురువారం నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలకు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్ల తీసేసి వేరే వాటిని బిగించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

నేడు బల్దియా వైస్ చైర్మన్ ఎన్నిక

- కామారెడ్డి మున్సిపాలిటీలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- గత నెలలోనే కౌన్సిలర్ వనిత పేరు ప్రకటించిన కాంగ్రెస్
- ఆమె విముఖత చూపడంతో పోటీలో మరికొందరు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా నూతన వైస్ చైర్మన్‌ను శుక్రవారం కౌన్సిల్ సభ్యులు ఎన్నుకోనున్నారు. వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న గడ్డం ఇందుప్రియ ఇటీవల చైర్‌పర్సన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైస్ చైర్‌పర్సన్ పదవి ఖాళీ కావడంతో రాష్ట్ర ఎన్నిక కమిషనర్ ఎన్నిక షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నేడు ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశంతో ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో..

బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి గద్దె దించిన విషయం తెలిసిందే. వైస్ చైర్‌పర్సన్ పదవిలో ఉన్న గడ్డం ఇందుప్రియతో పాటు 10 వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత సైతం చైర్‌పర్సన్ రేసులో ఉండగా కాంగ్రెస్ అధిష్టానం ఇందుప్రియ వైపు మొగ్గుచూపింది. దీంతో కౌన్సిలర్ వనిత నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ప్రమాణస్వీకారం చేసిన గత నెల 19న ఉర్దొండ వనితను వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆమె పేరును ప్రకటించి శాంతిపజేశారు. అయితే తాజాగా వైస్‌చైర్మన్ పదవి తనకు వద్దని కాంగ్రెస్ అధిష్టానం ముందు వనిత స్పష్టం చేసినట్లు తెలిసింది. చైర్‌పర్సన్ పోటీ కోసం ఖర్చు చేసిన డబ్బును తిరిగివ్వాలని మొర పెట్టుకున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ పదవి దక్కకపోవంతో అప్పటి నుంచి ఆమె నిరాశలోనే ఉన్నారు. అయితే ఆమెను అధిష్టానం ఇంకా బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె పదవి వద్దనుకుంటే వైస్ చైర్మన్ రేసులో 46వ వార్డు కౌన్సిలర్ కన్నయ్య, 15వ వార్డు, ఓ మైనార్టీ కౌన్సిలర్లు అంతేకాకుండా మరో ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు తమకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వారికే వైస్ చైర్మన్ పదవి దక్కే అవకాశాలున్నాయి.



కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 3,655 మంది విద్యార్థులకు గాను 3,470 మంది విద్యార్థులు హాజరయ్యారు. 185 మంది గైర్హాజరయ్యారు. 11 మంది ఖాళీ ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్ ఇచ్చారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,871 మంది విద్యార్థులకు గాను 1772 మంది పరీక్ష రాశారు. 99 మంది పరీక్షకు హాజరు కాలేదు. ముగ్గురు విద్యార్థులు ఖాళీ ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్ ఇవ్వగా ఐదుగురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



జనరల్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేవీఆర్

- వైద్యులు సమయానికి రాకపోవడంతో అసహనం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటల వరకు ఇద్దరు మినహా మిగతా వైద్యులు రాకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సమయానికి హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వైద్య అధికారులకు ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలను అందించాలన్నారు. ఐసీయూ, ఓపీ, డయాలసిస్, మెటర్నిటీ విభాగాలను పరిశీలించారు. వైద్య సేవల తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో తీవ్ర నీటి ఎద్దడి ఉందని తాగునీటితో పాటు బాత్‌రూంలలో నీరు రావడంతో రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నిత్యం కనీసం నాలుగు మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌లు వచ్చేలా చేయాలని ఆర్‌ఎంవో శ్రీనివాస్ ఎమ్మెల్యేను కోరగా.. ఆయన స్పందించి మున్సిపల్ కమిషనర్ సుజాతతో ఫోన్‌లో మాట్లాడి ట్యాంకర్లు పంపాలని ఆదేశించారు.

పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పట్టణంలో ప్రజలకు నీటిఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం ఉదయం ఆయన మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎఫ్‌బీవో శ్యాంతో మాట్లాడారు. నీటి సమస్య ఉన్న కాలనీల్లో సరిపడా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. పట్టణంలో సానిటేషన్ సమస్య రాకుండా చూడాలని సానిటరీ ఎస్సైలు రవీందర్, పర్వేజ్‌లను ఆదేశించారు.

నిప్పుల కొలిమి!

కొల్లూర్	44.7	జుక్కల్	43.6
రామారెడ్డి	44.0	డోంగ్లీ	43.5
బిచ్కుంద	43.9	హసన్‌పల్లి	43.1
సోమూర్	43.8	బీర్కూర్	43.0

- జిల్లా అంతటా పెరిగిన ఎండల తీవ్రత
- 44 డిగ్రీలు దాటడంతో జనం ఉక్కిరిబిక్కిరి
- గడపదాటి బయటకు వెళ్లలేని పరిస్థితి
- పగటిపూట రోడ్లపై కనిపించని జనం



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై కనిపించని రద్దీ

సాక్షి, కామారెడ్డి: రోహిణి కార్తె ప్రవేశించిన నుంచి జిల్లాలో ఎండల తీవ్రత మరింతగా పెరిగింది. ఉదయం ఎనిమిది గంటలకే సూరీడు నిప్పులు చిమ్ముతూ చుక్కలు చూపిస్తున్నాడు. పది, పదకొండు గంటల ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మధ్యాహ్నం రోడ్లపై జనం సంచరించడం లేదు. సాయంత్రం దాకా ఎండ తీవ్రత ఉంటోంది. నిప్పుల కొలిమిని తలపించేలా వాతావరణం తయారై ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే రోజంతా తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో ఇబ్బంది పడి, రాత్రికైనా నిద్రపోదామన్నా వేడి మాత్రం తెల్లారేదాకా తగ్గడం లేదు. మళ్లీ తెల్లారిన గంట రెండు గంటలకే ఎండ మొదలవుతోంది. దీంతో చాలా మంది సరిగా నిద్రపోవడం లేదు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రాత్రింబవళ్లు నడుస్తున్నా ఉక్కపోత ఇబ్బంది పెడుతోంది. ఎండలు, వేడిమితో జనం నీరసించిపోతున్నారు. చాలామంది డీహైడ్రేషన్‌కు గురై ఆస్పత్రులపాలవుతున్నారు. ఎండలతో జిల్లాలో ఇటీవల ఇద్దరు ఉపాధి కూలీలు మృత్యువాత పడ్డారు. ఉపా ధి పనులకు వెళ్లాలంటేనే కూలీలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పొద్దున ఏడుగంటలకే ఎండ సుర్రుమంటుండడంతో పనులు చేయలేకపోతున్నారు.

రోడ్లపై కనిపించని రద్దీ

జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో గురువారం పగటిపూట జనం రోడ్లపైకి రావడంలేదు. దీంతో జిల్లా కేంద్రంలో రోడ్లపై రద్దీ భారీగా తగ్గిపోయింది. గురువారం పట్టణంలో అంగడి ఉన్నప్పటికీ పగటిపూట రోడ్లపై జనం కనిపించలేదు. వాహనాల రాకపోకలు కూడా తగ్గాయి. ఎండలు తీవ్రత కారణంగా జనాలు సాయంత్రమే గడప దాటుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

విద్యుత్తు మీటర్లు గిరగిరా..

వేసవి కావడంతో మే నెలలో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నడుస్తున్నాయి. ఒకటో తేదీ నుంచి విద్యుత్తు బిల్లులు తీయనున్నారు. అయితే నెల రోజుల్లో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యలో ఒకటి రెండు రోజులు తప్ప మిగతా అన్ని రోజు ల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలు వేడిమితో ఇబ్బందుల పాలయ్యారు. విద్యుత్తు వాడకం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ఈ సారి కరెంటు బిల్లులు రెట్టింపు వస్తాయని వినియోగదారులు భావిస్తున్నారు.

బడి బాటను విజయవంతం చేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి జూన్ 3 నుంచి 11 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న బడిబాటను విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3 నుంచి 11 వరకు చేపట్టనున్న బడిబాట, 12 నుంచి 19 వరకు చేపట్టనున్న రోజువారీ కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బడిబాట కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను, స్వయం సహాయక సంఘాలు, విలేజ్ ఆర్గనైజేషన్లు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. చదువుకు దూరంగా ఉంటున్న బడి ఈడు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులు కల్పిస్తూ డ్యూయల్ డెస్క్ లు, డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జూన్ 3న బడిబాటపై గ్రామాల్లో సమావేశాలు, 4న ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించడం, 5 నుంచి 10 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పించాలన్నారు. 11న గ్రామసభ ఏర్పాటు చేసి 3 నుంచి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలను చర్చించాలన్నారు. 12న పాఠశాలలను ప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19న ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈవో రాజు, లింగం, పంచాయతీరాజ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: జూన్ 9న నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 4,797 మంది అభ్యర్థులు 12 కేంద్రాల్లో పరీ క్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులను నియమించామన్నారు. ఆయా కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు.ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు లోనికి అనుమతించాలన్నారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, ట్రెయినీ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆర్డీవో రంగనాథ రావు, డీఈవో రాజు, లింగం, డీటీవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ డీఎం ఇందిర పాల్గొన్నారు.

సానిటేషన్ సూపర్ వైజర్ తొలగింపు

- డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి
- ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్న సానిటేషన్ సూపర్‌వైజర్ ఆశమొల్ల సాయిబాబాను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేసి వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్యలపై తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సానిటేషన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయిబాబా ఆస్పత్రిలోని సిబ్బందిని వేధింపులకు గురి చేయడంతో పాటు, తాత్కాలికంగా పనిచేసే సిబ్బంది వద్ద ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయిస్తానని చెప్పి కొంత మంది వద్ద రూ. 70 వేల చొప్పున వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఉద్యోగం కోసం డబ్బులు ఇచ్చిన వారు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసిన పక్షంలో వారికి డబ్బులను అందించేలా చేస్తామన్నారు. ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకులు పెత్తనం చెలాయించడం, సిబ్బందితో దురుసుగా వ్యవహరించడం లాంటి సమస్యలపై బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు డీసీహెచ్‌ఎస్‌కు వినతిపత్రం అందించారు. ఆస్పత్రిలో ప్రతినిత్యం సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ పర్యవేక్షించాలని డీసీహెచ్‌ఎస్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, వైస్ ఎంపీపీ నర్సింలు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు సతీశ్, బీజేపీ నాయకులు బాలకిషన్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో డీసీహెచ్‌ఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

క్లుప్తంగా

సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేస్తాం



నిజాంసాగర్(జుక్కల్) : ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంక్షే మ పథకాలు, అభివృద్ధి పనులు కాస్త మందగించాయన్నారు. గురువారం పెద్ద కొడప్‌గల్ మండలంలోని పోచారం, లింగంపల్లి, బేగంపూర్, అంజని, తలాబ్, చావని తాండల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పర్య టించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలన్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి) : తెలంగాణ గురుకుల కళాశాలలు పోచంపాడు(బాలుర), పోచంపాడు(బాలికలు), ఎడపల్లి(బాలికలు), మద్నూర్(బాలుర) కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీల్లో మొదటి, రెండవ జాబితాలో సీటు వచ్చి ప్రవేశం పొందని విద్యార్థులకు మరొక సారి అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మిక శాఖకు సెస్ చెల్లించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా భవన, ఇతర నిర్మాణాల వ్యయంలో నుంచి ఒక శాతం సెస్‌ను కార్మిక శాఖకు చెల్లించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం అమలుపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో మాట్లాడారు.

ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా నిర్మించే భవన, ఇతర నిర్మాణ వ్యయంలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ అండ్ అంతర్ రాష్ట్ర కార్మిక చట్టం ప్రకారం పనులు నిర్ణయించే అధికారులు ప్రిన్సిపాల్ ఎంప్లాయర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. వారు తప్పనిసరిగా కార్మిక శాఖలో పేరు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. జిల్లాలో మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రైవేట్ భవన, ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటపుడు నిర్మాణ ఖర్చులో తప్పనిసరిగా ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు డిపాజిట్ చేయాలని సూచించారు. వసూలు చేసే సెస్ డబ్బు కార్మిక సంక్షేమం కోసం ఉపయోగించడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రఘునాథ్ రావు, సీపీవో రాజారామ్, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి క్రైం : జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని తగ్గించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, బ్లింకర్ లైట్లు, కల్వర్టుల వద్ద, అండర్‌పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, టీఎండ్‌గల రోడ్ ప్రాంతాల్లో సైన్ బోర్డులు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్యాచ్ వర్క్‌లు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. రోడ్డు వెంబడి ముళ్లపొదలు, చెట్ల పొదలు తొలగిస్తూ ఉండాలన్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు, బాణం గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు. వెంటిలేటర్‌తో కూడిన అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆస్పత్రిలో అత్యవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రక్తదానానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, ట్రెయినీ ఏఎస్పీ కాజల్, జాతీయ ప్రాధికార సంస్థ అధికారులు సీఎస్ రావు, భరత్, ఆర్‌అండ్‌బీ ఈఈ రవి శంకర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీటీవో శ్రీనివాస్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్



డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. వర్సిటీ పరిధిలో 38 కేంద్రాల్లో ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,132 మంది విద్యార్థులకు గానూ 7,700 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,589 మంది విద్యార్థులకు గానూ 3,417 మంది హాజరైనట్లు తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ జిల్లాలో గురువారం ఇంటర్ ఎకనామిక్స్, ఫిజిక్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 5,291 మందికి గాను 4,955 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలియజేశారు. మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులు 2,504 మందికి గాను 2,355 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు.

మండే ఎండ.. తట్టబుట్టే అండ..



ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉపాధి హామీ కూలీలు సతమతమవుతున్నారు. తాడ్వాయిలో మండలంలోని ఊరచెరువులో గురువారం ఉపాధి పనుల్లో భాగంగా కూలీలు ఇలా తట్టలను తలపై పెట్టుకుని ఎండ నుంచి కాపాడుకుంటున్న చిత్రమిది.

– తాడ్వాయి(ఎల్లారెడ్డి)

యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేత

- అధికారుల అలసత్వంతో తెగబడుతున్న స్మగ్లర్లు



మాచారెడ్డి అటవీ ప్రాంతంలో టేకు చెట్టును నరికిన స్మగ్లర్లు

మాచారెడ్డి : కలప స్మగ్లర్లు యథేచ్ఛగా టేకు చెట్లను నరుకుతూ తరలిస్తున్నారు. అధికారులు అటవీ సంపదను పరిరక్షించడానికి పటిష్ఠమైన చర్యలు చేపట్టకపోవడంతో అధికారుల కళ్లుగప్పి స్మగ్లర్లు తెగబడుతున్నారు. కొద్ది రోజులుగా మండలంలోని ఘన్‌పూర్, సోమారంపేట, రాజఖాన్‌పేట అటవీ ప్రాంతం నుంచి విచ్చలవిడిగా టేకు చెట్లను నరికి అటవీ ప్రాంతంలోనే సైజులుగా మార్చి రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి అనుమానం రాకుండా కార్లలో టేకు సైజులను తరలిస్తున్నట్లు సమాచారం. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వాల్టా చట్టమని చెబుతూ రైతుల సొంత చేలలోని చెట్లు నరికితే కేసులు పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

వన్య ప్రాణుల వేట

టేకు చెట్ల నరికివేతతో పాటు వన్య ప్రాణులను వేటాడుతున్నట్లు తెలుస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా వేటగాళ్లు వల పన్ని వన్య ప్రాణులను వేటాడుతున్నారు. రాత్రి వేళల్లో నాటు తుపాకులతో అటవీ ప్రాంతంలో సంచరిస్తూ కుందేళ్లు, జింకలను వేటాడుతున్నట్లు పలువురు గొర్రెల కాపర్లు చెబుతున్నారు. ఎండల తీవ్రతను తట్టుకోలేక గ్రామ పొలిమేరకు వస్తున్న వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. అటవీ సంపదను అందరూ కాపాడాలను పలువురు కోరుతున్నారు.

ఇంటర్ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(2024–25 విద్యా సంవత్సరం) ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, వొకేషనల్ గ్రూపులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం(31) తుది గడువని నిజామాబాద్ ఆర్‌సీవో కే.అలివేలు గురువారం తెలిపారు. 2024 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీవో సూచించారు.

జూన్ 22 నుంచి తెయూ బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.అరుణ గురువారం తెలిపారు. గ్రూప్- ఏ కళాశాలల్లో జూన్ 22, 24వ తేదీల్లో, గ్రూప్ -బి కళాశాలల్లో జూన్ 29, 30వ తేదీల లోపు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించుకుని మార్కులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

మొరం మాఫియా దౌర్జన్యం

ఎడపల్లి(బోధన్): మొరం అక్రమ రవాణాను అడ్డుకోడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులపై గురువారం మొరం మాఫియా దౌర్జన్యం చేసింది. ఠాణాకలాన్–కుర్నాపల్లి గ్రామాల శివారులో రెండ్రోజులుగా కొంతమంది అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ ధన్వాల్ మండల ఆర్‌ఐ వినోద్‌ను, మరో ఇద్దరు వీఆర్ఏలను మొరం తవ్వుతున్న ప్రదేశానికి పంపారు. రెవెన్యూ అధికారులు వెళ్లినా మొరం మాఫీయా తవ్వకాలను ఆపకుండా మొరంను ట్రాక్టర్‌లో నింపుతూ తరలిస్తున్నారు. దీన్ని నిరోధించడానికి అడ్డుగా వెళ్లిన వీఆర్‌వో కరుణాకర్‌ను జేసీబీతో నెట్టేశారు. మరో వీఆర్‌వోను ట్రాక్టర్ తో ఢీ కొట్టడానికి యత్నించారు. రెవెన్యూ అధికారు లు గట్టిగా ప్రతిఘటించగా జేసీబీ, ట్రాక్టర్లతో నిందితులు పరారయ్యారు. దాదాపు 30 మంది, అధికారులను చుట్టుముట్టి దుర్భాషలాడారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన మద్ది లింగారెడ్డి(54) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై సంజీవులు తెలిపారు. వివరాలు.. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన లింగారెడ్డి ఈనెల 25న తాడ్వాయిలోని తన సొంత ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న లింగారెడ్డిని చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు.. అక్కడ కూడా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం లింగారెడ్డి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లింగారెడ్డికి భార్య రేణుక, కుమార్తె భార్గవి ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి..



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎలుపుగొండ గ్రామానికి చెందిన కడారి రాములు(33) భార్యతో గొడవ పడి ఈ నెల 27న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుక్కను తప్పించబోయి గాయపడిన యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ సుజికీ షోరూం వద్ద కుక్కను తప్పించబోయి సంకటి సందీప్(21) తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన సందీప్ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వినాయక్ నగర్‌లో ఉన్న తన స్నేహితున్ని కలిసేందుకు వినాయక్‌నగర్ వచ్చి మళ్లీ తిరిగి అదే రోజు రాత్రి 8 గంటలకు ధర్మారం వెళ్తుండగా కుక్క అడ్డం రావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడు తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న మహిళ..

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్దాలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాడెం ఎల్లవ్వ(52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. నిజామాబాద్ మండలంలోని కాలూర్‌కు చెందిన తాడెం ఎల్లవ్వ బుధవారం జన్నేపల్లిలో జరిగిన వారాంతపు కూరగాయల సంతకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో మార్గ మధ్యంలో పాల్దాలో ఉండే కుమార్తె దగ్గరికి బస్సులో వెళ్లారు. బస్సు దిగి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఒకటో వార్డు అడ్లూరు గ్రామంలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందినట్లు బాధిత రైతు కృష్ణంరాజు గౌడ్ తెలిపారు. వివరాలు..అడ్లూరు కోట మైసమ్మ ఆలయ సమీపంలో గల పల్లె ప్రకృతి వనంలో విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందింది. సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగినట్లు అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

వాడి గ్రామంలో మరో గేదె..



మాచారెడ్డి: పాల్వంచ మండలం వాడి గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ గేదె మృతి చెందింది. వివరాలు.. నిమ్మల చిన్నోళ్ళ సత్తవ్వ గేదె గురువారం వారి చేను లోకి మేతకు వెళ్లింది. గాలికి ఎల్టీ లైన్ విద్యుత్ తీగ గేదెపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకొంది.

నర్వలో ఆవు..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన కాయితి రాములుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రోజు మాదిరిగా పంట పొలాల్లోకి మేతకు వెళ్లిన ఆవు మత్తడిపల్లి శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. దాంతో రాములుకు రూ.45 వేల ఆస్తి నష్టం వాటిల్లింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నిజామాబాద్‌కు చెందిన అన్సార్(35) అనే వ్యక్తిగా గుర్తించారు. ఎల్లారెడ్డి నుంచి ఠాణాకలాన్ గ్రామం మీదుగా నిజామాబాద్‌కు వెళ్తున్న సమయంలో ట్రాక్టర్, అన్సారీ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. అన్సార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన అజీజ్(38) పని నిమిత్తం నిజామాబాద్ వచ్చాడు. రోడ్డుపై అజీజ్ నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడే మృతి చెందాడు. ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి వివరాలు గుర్తించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



మంగలి వినయ్(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నర్వ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి వినయ్(21) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు..గునుకుల్ గ్రామానికి చెందిన వినయ్, కామారెడ్డి నుంచి ద్విచక్రవాహనంపై రాత్రివేళ ఇంటికి వెళ్తున్నాడు. బాన్సువాడ- ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై నర్వ గ్రామ శివారులోని చిన్నపూలు బ్రిడ్జి వద్ద బోలెరో వాహనం, ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వినయ్ రోడ్డుపై ఎగిరి పడడంతో తలకు తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు అంజయ్య, సాయవ్వ కన్నీటి పర్యంతం అయ్యారు. నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

రుద్రూర్: ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని చిక్కడపల్లి చెరువులో చేపడుతున్న మట్టి తవ్వకాలను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దార్ వెంకటేశం మట్టి తరలిస్తున్న ప్రాంతానికి చేరుకుని అక్కడ ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఐ నజీర్ ద్వారా పంచనామా చేయించి జేసీబీ, ఆరు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. చిక్కడపల్లి చెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. అక్రమంగా మొరం, మట్టి, ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంట్లో చోరీ

- మేడపై నిద్రిస్తుండగా ఘటన
- రెండు తులాల బంగారం.. 20 తులాల వెండి.. రూ.15 వేల నగదు అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడి వున్న వస్తువులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని శ్రీనివాస క్యాంప్ కాలనీలో నాగంపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగంపల్లి శ్రీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి మేడపై నిద్ర పోయారు. ఉదయం లేచి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళం తీసి రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.15 వేల నగదును దోచుకెళ్లారు. ఇంట్లో వస్తువులన్నీ చిందర వందరగా పడేశారు. ఈ విషయం గురించి బాధితుడు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకున్న చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరయ్య తెలిపారు.


సదాశివనగర్‌లో..

రామారెడ్డి: సదాశివనగర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పక్కన గల తోకల నరేందర్‌కు చెందిన జనరల్ స్టోర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాప్ వెనుక వైపు గోడకు కన్నం చేసి లోపలికి చొరబడి, రూ.8,200 నగదును ఎత్తుకెళ్లినట్లు నరేందర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెనక వైపు దొంగలు వేసిన కన్నం

నాలుగేళ్ల పాప దారుణ హత్య



హత్యకు గురైన నాలుగేళ్ల పాప లక్ష్మి

మాక్లూర్: తనకు పుట్టిన బిడ్డ కాదన్న నెపంతో నాలుగేళ్ల బాలికను గొంతు నొక్కి హతమార్చాడు వరుసకు తండ్రి అయిన వ్యక్తి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మోరాకు చెందిన ఈర్నాల అరుణ్‌కు మొదటి భార్యతో విడాకులు అయ్యాయి. అనంతరం నిజామాబాద్ నగరానికి చెందిన సునీతను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే సునీతకు మొదటి భర్తతో విడాకులు కాగా లక్ష్మి అనే పాప ఉంది. పాపను సొంతకూతురిగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో చెప్పి అరుణ్ సునీతను పెళ్లి చేసుకున్నాడు. ఆరు నెలల వరకు పాపను సొంతబిడ్డ మాదిరిగా చూసుకున్న అరుణ్‌లో తర్వాత మార్పు వచ్చింది. రోజూ పాపను హింసించడం ప్రారంభించాడు. కనికరం లేకుండా మూడు నెలల క్రితం చితక బాది చేయి విరగ్గొట్టాడు. అప్పటి నుంచి సునీత తన బిడ్డను నిజామాబాద్‌లోని తల్లిదండ్రుల వద్దే ఉంచుతోంది. ఈ నెల 29న తన బిడ్డ లక్ష్మి ని చూసి వస్తానని చెప్పి సునీత నిజామాబాద్ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో చిన్నారి ఏడ్వటంతో రెండు రోజులు ఉంచుకుని పంపిస్తానని తల్లి తండ్రులకు చెప్పి సునీత లక్ష్మిని వెంటబెట్టుకుని ధర్మోర వచ్చింది. మళ్లీ బిడ్డను తీసుకొచ్చిందని అరుణ్ భార్య సునీతపై మండిపడ్డాడు. భోజన అనంతరం సునీత బాత్‌రూమ్‌కు వెళ్లింది గమనించిన అరుణ్ నిద్రిస్తున్న లక్ష్మిని గొంతు నొక్కి హతమార్చాడు. నార్త్‌జోన్ సీఐ సతీష్, ఎస్సై సుధీర్‌రావు పంచనామా నిర్వహించారు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

నవీపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం మృతి చెందిన మృతుడి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ మండలం నాయగావ్‌కు చెందిన గంగారామ్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశాడని, తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని బస్టాండ్‌లో దిగాడని పేర్కొన్నారు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాటాడుతున్న 11 మందిని గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి నుంచి రూ.94 వేల 600 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కేసులు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాల్కొండ: మెండోరా మండల కేంద్రం శివారులోని ఓ రైస్ మిల్లులో దాచిన 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. రైస్ మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయని, వాటిని మూడు వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించటానికి సిద్ధమవుతున్నారని పక్కా సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేయగా భారీగా బియ్యం పట్టుబడ్డాయి. బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. కాపర్, ఆయిల్ చోరీ



డిచ్‌పల్లి: వెస్లీనగర్ తండా శివారులో రెండు, నాకాతండా గ్రామ శివారులోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి వాటిలో నుంచి కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేష్ తెలిపారు. రెండు, మూడు రోజులుగా రెండు తండాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్, ఆయిల్‌ను దొంగతనం చేసినట్లు మెంట్రాజ్‌పల్లి లైన్‌మెన్ ఈశ్వర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.